ఫార్ములా-ఈ కేసులో నిందలు తప్ప నిజాలు లేవు

మాట్లాడుతున్న మాజీ వైస్ ఎంపీపీ

అశ్వాపురం, జనవరి 10: ఫార్ములా ఈ-కార్ రేసులో కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై చేస్తున్నది ఉద్దేశపూర్వకమేనని ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేకనే బీఆర్ఎస్ నాయకులపై నిరాధారమైన నిందారోపణలు చేస్తుందే తప్ప నిజాలు ఎంతమాత్రం లేవని బీఆర్ఎస్ నాయకులు, మాజీ వైస్ ఎంపీపీ కంచుగట్ల వీరభద్రం ఖండించారు. శుక్రవారం బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కార్‌పై మోపిన అబద్ధాలను తెలంగాణ ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. బీఆర్ఎస్ మండల యువజన అధ్యక్షుడు గద్దల రామకృష్ణ, మండల సహాయ కార్యదర్శి సుంచు రామ్మూర్తి, నాయకులు శెట్టిపల్లి శేఖర్, ఇసంపల్లి సురేశ్ పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చాటిన అంగన్‌వాడీ టీచర్

అంగన్‌వాడీ టీచర్ కృష్ణవేణిని సన్మానిస్తున్న హెచ్ఎం కోటేశ్వరరావు, గ్రామస్తులు

బూర్గంపహాడ్, జనవరి 10: లక్ష్యం సాధించాలంటే వయస్సు అడ్డురాదని నిరూపించిం ది మండలంలోని తాళ్ల గొమ్మూరుకు చెందిన అంగన్‌వాడీ టీచర్ కణితి కృష్ణవేణి. ఈనెల 4, 5 తేదీల్లో హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో కృష్ణవేణి 200 మీటర్ల పరుగుపందెంలో రెండవ స్థానం, 100 మీటర్ల పరుగు పందెంలో మూడవస్థానం, లాంగ్‌జంప్‌లో రెండవస్థానం, 4/100 రిలేలో మూడవ స్థానం సాధించి తన ప్రతిభను చాటుకుంది. కోచ్ ధర్మరాజు ఇచ్చిన శిక్షణలో ఈ పోటీల్లో పాల్గొని విజయం సాధించినట్లు తెలిపింది. ఫిబ్రవరిలో కేరళలో జరగనున్న నేషనల్ అథ్లెటిక్స్‌లో విజయం సాధిస్తానని కృష్ణవేణి ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కృష్ణవేణిని ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కోటేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం తాళ్లగొమ్మూరు గ్రామస్తులు సత్కరించారు. కార్యక్రమంలో బెల్లంకొండ రామారావు, వాసుదేవరావు, మాజీ సర్పంచ్ కొయ్యల పుల్లారావు, తాతా మాధవీలత, బేబి, తేజావత్ మంగీలాల్, వడ్లమూడి కుమారి, అంగన్‌వాడీ టీచర్ అనసూర్య, కోచ్ ధర్మారావు, గిరి పాల్గొన్నారు.

బస్సులు లేక గంటల కొద్దీ భక్తుల నిరీక్షణ

భద్రాచలం బస్టాండ్‌లో బస్సులు లేకపోవడంతో నిరీక్షిస్తున్న ప్రయాణీకులు

భద్రాచలం, జనవరి 10: భద్రాచలం ముక్కోటి వైకుంఠ ఏకాదశి వేడుకకు రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తుంటారు. శుక్రవారం జరిగిన ముక్కోటి ఉత్సవానికి ఒక రోజు ముందుగానే భక్తులు భద్రాచలం చేరుకున్నారు. ఉత్తర ద్వారదర్శనం అనంతరం తిరిగి వెళ్లేందుకు బస్టాండ్‌కు వెళ్లగా అక్కడ బస్సులు సరిపడా లేకపోవడంతో గంటల కొద్దీ నిరీక్షించారు. ప్రతి ఏడాది ముక్కోటి పండుగ సందర్భంగా ద్వారదర్శనం కోసం భక్తులు అధిక సంఖ్యలో వస్తారని తెలిసి కూడా అధికారులకు బస్సులను ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతాలు

సీమంతాలు చేస్తున్న ఐసీడీఎస్ అధికారులు

బూర్గంపహాడ్, జనవరి 10: మండలంలోని సారపాక-1 అంగన్‌వాడీ కేంద్రం లో ఐటీసీ మిషన్ సునెరేకల్ ఐజీడీ ఎన్‌జీవో, అంగన్‌వాడీ టీచర్ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ సీడీపీవో రేవతి, సూపర్‌వైజర్ సక్కుబాయి శుక్రవారం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ వెంకటరమణ, ఏఎన్ఎం స్వాతి, ఆశావర్కర్ కల్యాణి, ఐజీడీ ఎన్‌జీవో ఫీల్డ్ కో-ఆర్డినేటర్ ప్రశాంతి, స్వాతి, అభిషేక్, గర్భిణులు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

అటవీ సంపద జీసీసీకే విక్రయించాలి

మాట్లాడుతున్న నర్సింహారావు

గుండాల, జనవరి10: అటవీ సంపద అయిన చిల్లగింజలు, ముష్టి గింజలు ఇతర సంపదను గిరిజన సహకార సంస్థకే విక్రయించాలని, దళారులకు అమ్మి మోసపోవద్దని ఇల్లెందు డివిజన్ గిరిజన సహకార సంస్థ మేనేజర్ ఎస్.నర్సింహారావు కోరారు. శుక్రవారం గుండాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గుండాల మండలంలో అన్నపురెడ్డిపల్లి ఇతర మండలాల నుంచి వచ్చి దళారులు ఆదివాసీల నుంచి ముష్టి గింజలను ఎక్కువ ధర చూపిస్తూ తూకాల్లో మోసం చేస్తూ దగాకు పాల్పడుతున్నారన్నారు. గిరిజన సహకార సంస్థ కిలో ముష్టి గింజలకు రూ.75 చెల్లిస్తుందని జీసీసీలోనే అమ్మకాలు చేయాలని కోరారు. సమావేశంలో గుండాల జీసీసీ మేనేజర్ పగడయ్య తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

మణుగూరు టౌన్, జనవరి 10: సింగరేణి రూపొందించిన క్యాలెండర్‌ను శుక్రవారం మణుగూరులో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు నాగెల్లి ఆవిష్కరించారు. సంస్థ విశిష్టత, కార్మిక సంక్షేమం ప్రతిబింబించేలా సింగరేణి క్యాలెండర్ రూపకల్పన చేశారని తెలిపారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ నాయకులు పాల్గొన్నారు.

దమ్మపేట రూరల్‌లో..

దమ్మపేట రూరల్, జనవరి 10: ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఐఎల్‌పీఏ) క్యాలెండర్‌ను శుక్రవారం దమ్మపేట ఫస్ట్ క్లాస్ జడ్జి సాయి ఆవిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మారం సతీష్ పాల్గొన్నారు.

దారి.. దారుణం

రాళ్లు తేలిన జలవాగు మెటల్ రోడ్డు

దమ్మపేట, జనవరి 10: మండలంలోని మారెప్పగూడెం పంచాయతీ జలవాగు గ్రామంలోని మెటల్ రోడ్డుపై కంకర రాళ్లు తేలాయి. ఈ రోడ్డుపై నడక నరకప్రాయంగా ఉందని, వాహనాలు దెబ్బతింటున్నాయి స్థానికులు ఆందోళన-ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిని పునర్నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు.

పోలీసుగా భద్రాద్రి కలెక్టర్..

- సూచనలు పాటించాలంటూ భక్తులను సమాదాయించిన జితేశ్
- ఉత్తరద్వార దర్శన వీఐపీ టికెట్లు కొన్న భక్తులకూ దక్కని దర్శన భాగ్యం

సామాన్య భక్తుల్లా రాముడి దర్శనం చేసుకుంటున్న కలెక్టర్లు, ఐటీడీఏ పీవో, పోలీసుల సూచనలు పాటించకపోవడంతో భక్తులను సముదాయిస్తున్న కలెక్టర్ జితేశ్

భద్రాచలం, జనవరి 10: వైకుంఠ ఏకాదశి వేడుకల్లో భాగంగా శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ఉత్తర ద్వార దర్శన ఉత్సవాల్లో కలెక్టర్ జితేశ్ పోలీసు విధులూ నిర్వహించారు. గ్యాలరీలు కిక్కిరిసిపోయి భక్తులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గమనించిన ఆయన.. వెంటనే వాకీటాకీ అందుకొని పోలీసు విధులనూ చేపట్టారు. పోలీసుల సూచనలు పాటించాలంటూ భక్తులను సముదాయించారు. ఉత్తర ద్వారదర్శనాన్ని వీక్షించేందుకు భక్తులకు టిక్కెట్లు విక్రయించిన ఆలయ అధికారులు అందుకు తగిన ఏర్పాట్లు చేయలేదు. దీంతో పోటెత్తిన భక్తులను నియంత్రించేందుకు ఇటు పోలీసు అధికారులు, అటు ఆలయ అధికారులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. దీంతో భక్తులు కూడా అసహనానికి గురయ్యారు. ఉత్తర ద్వారం వద్ద దర్శనం కోసం వెళ్తున్న భక్తులను పోలీసులు కట్టడి చేసేందుకు 'ముందుకు పదండి..' అంటూ గదమాయించారు. అయితే వీఐపీ టికెట్లు కొనుగోలు చేసిన తమకే స్థలం లేకపోవడం ఏంటంటూ పోలీసులను భక్తులు తిరిగి ప్రశ్నించారు. దీంతో పోలీసులు, భక్తులకు మధ్య వాగ్వాదం తలెత్తంది. అక్కడే ఉన్న కలెక్టర్ జితేశ్.. వాకీటాకీ అందుకున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని పోలీసులకు సూచనలు చేశారు. అలాగే, పోలీసుల సూచనలు పాటించాలని భక్తులను సముదాయించారు. దీంతో భక్తులు శాంతించారు. కాగా, వీఐపీ టికెట్లు కొనుగోలు చేసినప్పటికీ తమకు రామయ్య దర్శనభాగ్యం కలగలేదంటూ కొందరు భక్తులు అసహనానికి గురయ్యారు. ఇదిలా ఉండగా అధికారులు, వీఐపీలకు కేటాయించిన గ్యాలరీ కిక్కిరిసిపోవడంతో అటు వీఐపీలు, ఇటు ఉన్నతాధికారులు ప్రెస్ గ్యాలరీలోకి వచ్చారు. దీంతో మీడియా ప్రతినిధులు కవరేజీకి ఇబ్బందులు పడ్డారు.

మేమూ సామాన్యులమే..

రామయ్య దర్శనానికి క్యూలైన్‌లో కలెక్టర్లు, ఐటీడీఏ పీవో

భద్రాచలం, జనవరి 10: 'వీఐపీలమనే గర్వమేమీ లేదు. అధికారులమనే దర్పమూ లేదు. అందరిలా మేమూ సామాన్యులమే..' అన్నట్లుగా భద్రాద్రి, వికారాబాద్ కలెక్టర్లు, ఐటీడీఏ పీవోలు సాధారణ భక్తుల్లో కలిసిపోయారు. సాక్షత్తూ దైవదర్శనంలో క్యూలైన్ పాటించారు జితేశ్ వి పాటిల్ ప్రతీక్‌జైన్, రాహుల్. శుక్రవారం తెల్లవారుజామున భద్రాచలంలో జరిగిన వైకుంఠ ఉత్తర ద్వారదర్శనం అనంతరం వారు గర్భగుడిలో స్వామివారిని దర్శించేందుకు వెళ్లారు. అక్కడ వారు తమ అధికార వెలుసుబాట్లను పక్కనపెట్టి సామాన్య భక్తులు ఉన్న క్యూలైన్‌లోనే వెళ్లారు. భక్తులతోపాటే స్వామివారిని దర్శించుకున్నారు. దీనిని గమనించిన సామాన్య భక్తులు.. హోదాలను పక్కనబెట్టి తమతోపాటే వారు స్వామిదర్శనానికి వచ్చారంటూ ప్రశంసలు కురిపించారు. ఇదిలా ఉంటే కిందిస్థాయి అధికారులు, పోలీసులు మాత్రం వీఐపీల మాదిరిగా దర్శనం చేసుకోవడం కొసమెరుపు.

కొత్తగూడేనికి విమానాశ్రయం

20న స్థల పరిశీలనకు కేంద్ర బృందం రాక
మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 10 (నమస్తే తెలంగాణ): కొత్తగూడెంలో విమానాశ్రయం ఏర్పాటు తథ్యమని, ఈ నెల 20న స్థల పరిశీలనకు కొత్తగూడెంలో ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా బృందాలు పర్యటిస్తాయని రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఒక ప్రకటనలో వెల్లడించారు. తాను ఇటీవల కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడును కలిసి కొత్తగూడెం విమానాశ్రయం ఏర్పాటు అవసరాన్ని వివరించినట్లు తెలిపారు. స్థల పరిశీలనకు ఈ నెల 20న కేంద్ర బృందాలను పంపుతానని కేంద్ర మంత్రి చెప్పారని పేర్కొన్నారు.

హిందీ.. మనందరిదీ

పాల్వంచ రూరల్, జనవరి 10: జాతీయ భాష హిందీ మనందరిదీనని, దానిని అందరం నేర్చుకోవాలని మండలంలోని లక్ష్మీదేవిపల్లి(ఎస్) ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పద్మ అన్నారు. కళాశాలలో శుక్రవారం విశ్వ హిందీ దినోత్సవంలో ఆమె మాట్లాడుతూ.. మన దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా అనేకమంది మాట్లాడుతున్న హిందీని నేర్చుకుంటే మంచిదని అన్నారు. కనీసం మాట్లాడడమైనా నేర్చుకోవాలని కోరారు. అధ్యాపకులు షెహనాజ్ ఖాన్, టి.అరుణకుమారి, డి.రమేష్, కొండలరావు, స్వరూపరాణి, పారెల్లి శ్రీనివాస్, రాంబాబు, శ్రీదేవి, దీపిక, విమల, లీలాసౌమ్య, కావ్య, పర్వీన్, రమేష్, శ్రీనివాస్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ కమిటీ ప్రమాణ స్వీకారం

అశ్వారావుపేట టౌన్, జనవరి 10: అశ్వారావుపేట పట్టణ వాసవీ క్లబ్ నూతన కమిటీ శుక్రవారం స్థానిక వాసవీ అమ్మవారి ఆలయంలో ప్రమాణ స్వీకారం చేసింది. అధ్యక్షుడిగా సత్యవరపు బాలగంగాధర్, ప్రధాన కార్యదర్శిగా సమయమంతుల మోహనరావు, కోశాధికారిగా రావిక్రింది కుమార్ రాజు, మరికొందరు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. మాజీ ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జూలూరుపాడు, జనవరి 10: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా జూలూరుపాడు సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 10.00 నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు మండల విద్యుత్ శాఖాధికారి ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు ఇల్లెందులో..

ఇల్లెందు, జనవరి 10: ఇల్లెందు పట్టణంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్ అసిస్టెంట్ ఇంజినీర్ ఓ ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ ఇల్లెందు ఉప కేంద్రంలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8.00 నుంచి 11.00 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్సై సురేశ్

టేకులపల్లి, జనవరి 10: మండలంలోని మంగ్యతండాలో శుక్రవారం ఏర్పాటు చేసిన కల్లు మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఎస్సై పోగుల సురేశ్, కోరం సురేందర్ ప్రారంభించారు. సంక్రాంతి పండుగను అందరూ ఆనందంగా జరుపుకోవాలని సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మాలోత్ భాస్కర్, మాజీ ఉప సర్పంచ్ రాజ్‌కుమార్, నాయకులు రెడ్యా నాయక్, బానోత్ రవి, బోస్, గణేశ్, సుదీప్ పాల్గొన్నారు.

గోదాముకు శంకుస్థాపన

రామవరం, జనవరి 10: సింగరేణి కొత్తగూడెం ఏరియా సత్తుపల్లిలోని ఎన్టీఆర్ నగర్‌లో వ్యవసాయ గోదాముకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఏరియా జీఎం శాలెంరాజు, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, ఎస్‌వోటు జీఎం కోటిరెడ్డి, డీజీఎం శివకేశవరావు, కిష్టారం ఓసీ పీవో ఎంవి.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో ముందస్తు సంక్రాంతి సంబురాలు

చర్ల: చిన్నారులకు భోగి పండ్లు పోస్తున్నఅతిథులు, అశ్వాపురం: సంక్రాంతి సంబురాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు, చండ్రుగొండ: అంబేద్కర్‌నగర్ పాఠశాలలో..

చర్ల, జనవరి10: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం విద్యాసంస్థల్లో సంక్రాంతి సంబురాలు జరుపుకున్నారు. స్థానిక శ్రీవాణి విద్యానికేతన్ పాఠశాలలో విద్యార్థుల తలపై భోగిపండ్లు పోసి ఆశీర్వదించారు. హెచ్ఎం మైనేని పద్మజ సంక్రాంతి, భోగి గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ శ్రామిక, ఆర్ఐ వరలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రవీంద్ర పబ్లిక్ స్కూల్‌లో..

అశ్వాపురం, జనవరి 10: స్థానిక రవీంద్ర పబ్లిక్ స్కూల్‌లో సంక్రాంతి సంబురాలు శుక్రవారం నిర్వహించారు. విద్యార్థులతో బోగి మంటలు, రంగవల్లులు వేయించి బహుమతులు అందజేశారు. హెచ్ఎం దొడ్డా రమేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌కాలనీ ప్రాథమిక పాఠశాలలో..

చండ్రుగొండ, జనవరి 10: స్థానిక అంబేద్కర్‌కాలనీ ప్రాథమిక పాఠశాలలో సంక్రాంతి సందర్భంగా విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. హెచ్ఎం నకిరకంటి వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయురాలు అనసూయ, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ ఉన్నత బాలురు పాఠశాలలో..

అశ్వారావుపేట టౌన్, జనవరి 10: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత బాలురు పాఠశాలలో శుక్రవారం పాఠశాల ఆవరణ విద్యార్థుల సందడితో పండుగ వాతావరనం నెలకొన్నది. పాధ్యాయులు, విద్యార్థులు భోగి మంట వేయగా విద్యార్థులు సాంప్రదాయ దుస్తులతో ఆటపాటలతో అలరించారు. విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. హెచ్ఎం పి హరిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పలు పాఠశాలల్లో..

టేకులపల్లి, జనవరి 10: మండలంలోని బోడు, బొమ్మనపల్లి, కోయగూడెం ఆశ్రమ పాఠశాలల్లో సంక్రాంతి పండగ సందర్భంగా ఆటల,పాటల,ముగ్గుల పోటీలు నిర్వహించారు. పిల్లలకు ఉపాధ్యాయులు భోగి పండ్లు పోశారు. కార్యక్రమంలో ఎంఈవో జగన్, పాఠశాలల హెచ్ఎంలు అమర్ సింగ్, జ్యోతి రాణి, శ్రీనివాస్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో..

పాల్వంచ, జనవరి 10: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పాల్వంచలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ముందస్తుగా శుక్రవారం సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులు రంగులు వేసి రంగవల్లికలతో అలంకరించారు. పండుగ విశిష్టతను విద్యార్థులందరికీ ఉపాధ్యాయులు వివరించారు.

చాతకొండ ఉన్నత పాఠశాలలో..

లక్ష్మీదేవిపల్లి, డిసెంబర్ 10: మండలంలోని చాతకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రోడ్డు భద్రత నిబంధనలు, ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఎంఈవో కృష్ణయ్య, జిల్లా సైన్స్ ఆఫీసర్ చలపతిరాజు, ఉపాధ్యాయులు నాగలక్ష్మి, అమీరుద్దీన్, వాణిశ్రీ, లక్ష్మీ, నాగేశ్వరరావు, పద్మశ్రీ పాల్గొన్నారు.

అశ్వారావుపేట టౌన్: పోటీలను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు, టేకులపల్లి: భోగి పండ్లు పోస్తున్న ఉపాధ్యాయులు, పాల్వంచ: బోగి మంటలు వేస్తున్న ఉపాధ్యాయులు

ఊరెళ్లితే సమాచారం ఇవ్వండి

ఎస్సై సాయికిశోర్‌రెడ్డి

దమ్మపేట, జనవరి 10: మండలానికి చెందిన ప్రజలు ఎవరైనా ఊరెళ్లితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై సాయికిశోర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన పోలీసు స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. సంక్రాంతి పండుగ సందర్భంగా సెలవుల నిమిత్తం ఇతర గ్రామాలకు వెళితే మీకు సంబంధించిన వివరాలు పోలీసుస్టేషన్‌లో తెలపాలన్నారు. అలా చేస్తే పోలీసులు ఇళ్లకు నిఘా ఏర్పాటు చేసి వచ్చేంతవరకు ఎలాంటి దొంగతనాలు జరగకుండా చూస్తామన్నారు. పండుగ సమయాల్లో ఇళ్ల వద్ద లేకపోతే దొంగలు దొంగతనాలకు పాల్పడే అవకాశం ఉన్నందున పోలీసు సూచనలు తప్పకుండా పాటించాలన్నారు. 8712682066 నెంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలపాలని ఎస్సై మండల ప్రజలకు సూచించారు.

స్టడీ గైడ్స్ పంపిణీ

స్టడీ గైడ్స్ పంపిణీ చేస్తున్న పుష్పాల

అశ్వారావుపేట (ములకలపల్లి), జనవరి 10: మండలంలోని పూసుగూడెం పాఠశాల విద్యార్థులకు చిరాగ్ ఫౌండేషన్ తరపున స్టడీ గైడ్స్‌ను శుక్రవారం బీఆర్ఎస్ నాయకుడు పుష్పాల చంద్రరావు పంపిణీ చేశారు. గ్రామ పెద్దలు బండి కొమరయ్య, శనగపాటి సీతారాములు, పుష్పాల సాయి, హెచ్ఎం జి.బాను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మావోయిస్టు మృతదేహాల గుర్తింపు

మృతుల్లో 'ఐఈడీ' నిపుణుడు మహేశ్

పోలీసులు స్వాధీనపరుచుకున్న ఆయుధ, సామగ్రి

కొత్తగూడెం క్రైం, జనవరి 10 : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా-బీజాపూర్ జిల్లాల సరిహద్దుల్లో గురువారం జరిగిన ఎదురుకాల్పుల్లో మృతిచెందిన ముగ్గురు మావోయిస్టులను గుర్తించినట్లు సుక్మా జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్ శుక్రవారం మీడియాకు వెల్లడించారు. సుక్మా-బీజాపూర్ జిల్లాల సరిహద్దు జగర్‌గుండా పోలీస్‌స్టేషన్ పరిధి గుండ్రాతిగూడెం-పాలిగూడెం అడవుల్లో గురువారం జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందిన విషయం విదితమే. మృతుల్లో ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైస్(ఐఈడీ) తయారీలో నిపుణుడైన హార్డ్ కోర్ మావోయిస్టు, రూ.8 లక్షల రివార్డు గల 30వ నెంబర్ ప్లాటూన్ డిప్యూటీ కమాండర్ కొర్సా మహేశ్‌తోపాటు ఏరియా కమిటీ మెంబర్లు మడవి నవీన్, అవలం భీమా ఉన్నట్లు వెల్లడించారు. ఘటనా స్థలం నుంచి భారీగా ఆయుధ, వస్తు సామగ్రి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ ఆపరేషన్ సుక్మా జిల్లా డీఆర్‌జీ, ఎస్‌టీఎఫ్, కోబ్రా 203, 204, 206, 208 బెటాయలిన్లతో పాటు సీఆర్‌పీఎఫ్ 241, 131 బెటాలిన్ల సంయుక్త ఆధ్వర్యంలో జరిగినట్లు పేర్కొన్నారు.

సీఈఆర్ క్లబ్ సందర్శన

సీఈఆర్ క్లబ్ పరిశీలిస్తున్న అధికారులు

రామవరం, జనవరి 10: రుద్రంపూర్‌లోని సీఈఆర్ క్లబ్‌ను ఏరియా ఎస్‌వోటు జీఎం జీవీ కోటిరెడ్డి గురువారం సందర్శించారు. గౌతంపూర్ కమిటీ హాల్, రామవరం కమ్యూనిటీ హాల్‌తో పాటు సీఈఆర్ క్లబ్‌ను కూడా తీర్చిద్దాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డీజీఎం శివకేశవరావు, జీకే ఓసీ వెల్ఫేర్ ఆఫీసర్ ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు

మణుగూరు టౌన్, జనవరి 10: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని మణుగూరు ప్రభుత్వ ఐటీఐలో శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు ఐటీఐ ప్రిన్సిపాల్ ప్రభాకర్ విజేతలకు బహుమతులు అందజేశారు. టీవోజీ రవి, జ్యోతిరాణి, సయదిప్తాకర్, ఏటీవోలు జీవీ కృష్ణారావు పాల్గొన్నారు.

కార్మిక నాయకుడు శంకర్‌కు సన్మానం

రామవరం, జనవరి 10: సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక నాయకుడు రాసూరి శంకర్.. ఇటీవల బహుజన సాహిత్య అకాడమీ నుంచి కార్మిక రత్న అవార్డును అందుకున్నారు. ఆయనను శుక్రవారం ఏరియా జీఎం శాలెంరాజు అభినందించి సన్మానించారు. అధికారులు, కార్మిక నాయకులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

చిన్నారిపై అఘాయిత్యం

నిందితుడిపై పోక్సో కేసు నమోదు

లక్ష్మీదేవిపల్లి, జనవరి 10 : చాక్లెట్ ఇస్తానని నమ్మించి ఓ దుర్మార్గుడు చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం ప్రశాంతినగర్‌లో గురువారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ప్రశాంతినగర్‌లోని ఓ ప్రైవేటు కళాశాల మెస్‌లో వంట చేస్తున్న ఓ కుటుంబం అక్కడే నివసిస్తోంది. ఈ క్రమంలో అదే వంట విభాగంలో పనిచేస్తున్న శ్రీకాంత్ ఆ కుటుంబానికి చెందిన చిన్నారిపై కన్నేశాడు. చాక్లెట్ కొనిస్తానని చెప్పి మరో గదిలోకి ఆ చిన్నారిని తీసుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. దీంతో బాలిక కేకలు వేయడంతో నిందితుడిని పట్టుకొని దేహశుద్ధి చేశారు. చిన్నారి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై రమణారెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. చిన్నారిని వైద్యం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి, ఆయిల్ తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

పట్టుకున్న గంజాయి, ఆయిల్‌తో పోలీసులు

పాల్వంచ, జనవరి 10: ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి నుంచి హైదరాబాద్‌కు గంజాయిని, ఆయిల్‌ను తరలిస్తున్న ఒడిశాకు చెందిన ఇద్దరిని పాల్వంచ పోలీసులు శుక్రవారం రాత్రి అరెస్ట్ చేశారు. పాల్వంచ బస్టాండ్ ఆవరణలో పట్టణ ఎస్సైలు సుమన్, రాఘవయ్య ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. అనుమానాస్పదంగా కనిపించిన వాహనాలను అ